# రామన్న వల్లే బయటికొచ్చిన



బాధిత రైతు అబ్బాడి రాజిరెడ్డి, భార్య లత

- కావాలనే నాపై అక్రమ కేసు పెట్టిన్రు
- భూ కబ్జా చేశానంటూ జైల్లో వేసిన్రు
- గొంతు ఆపరేషన్ అయిందని చెప్పినా వినలే
- పుట్టెడు దుఃఖంలో ఉన్న నాకు కేటీఆర్ సార్ అండగా నిలిచిండు
- బెయిల్ ఇప్పించి కొండంత ధైర్యం చెప్పిండు
- 'నమస్తే'తో రైతు అబ్బాడి రాజిరెడ్డి

**'మాది సాధారణ రైతు కుటుంబం. కాయకష్టం చేసుకుంటూ బతికేటోళ్లం. ఊళ్లో తప్ప బయటి ప్రపంచం ఎట్లుంటదో తెలువది. ఎన్నడూ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కలే నేను. కానీ, భూ కబ్జా చేశానంటూ నాపై అక్రమ కేసు పెట్టిన్రు. అప్పటికే గొంతు ఆపరేషన్ చేయించుకొని మాట్లాడలేని స్థితిలో ఉన్న నన్ను జైలుకు పంపి మానసికంగా వేధించిన్రు' అంటూ' తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డి వాపోయాడు. ఈ మేరకు శనివారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని తనపై ఎలాంటి విచారణ జరపకుండానే అక్రమంగా కేసులో ఇరికిస్తే 'నేనున్నానంటూ' కేటీఆర్ అండగా నిలిచారని, బెయిల్ ఇప్పించి బయటకు తెచ్చారని పేర్కొన్నాడు. ఐదు రోజులు జైలులో నిద్రాహారాలు లేకుండా గడిపిన తనకు సొంత అన్నలా భరోసాగా నిలిచిన దేవుడు కేటీఆర్‌కు చేతులెత్తి మొక్కుతున్నామంటూ కృతజ్ఞతలు తెలిపాడు. భూమికి సంబంధించి కేసు పూర్వపరాలు ఆయన మాటల్లోనే..**

రాజన్న సిరిసిల్ల, మార్చి 1(నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల రూరల్ : ''జిల్లెల్లలో నాకు మూడెకరాల పట్టాభూమి, మా నాన్న నుంచి వారసత్వంగా వచ్చిన 30 గుంటల అసైన్డ్ భూమి ఉంది. సర్వే నంబర్ 1183/4/1/1లోని దంతె మల్లయ్యకు చెందిన 30 గుంటల అసైన్డ్ భూమిని యాదవులు కొనుగోలు చేసిన్రు. వారి నుంచి మా నాన్న అబ్బాడి నారాయణ కొనుగోలు చేసిండు. ఆ భూమి పక్కనే సర్వే నంబర్ 1173/1 లో 3 ఎకరాల పట్టాభూమి ఉన్నందున రెండు కలిపి సాగు చేసుకుంటూ వస్తున్నం. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు 2017లో రెవెన్యూ అధికారులు మా ఇంటికి వచ్చిన్రు. 30 గుంటల అసైన్డ్ భూమిలో సాగు చేసుకున్న వివరాలను సేకరించిన్రు. వాస్తవానికి 30 గుంటల అసైన్డ్ భూమిని చాలా ఏండ్ల క్రితం యాదవుల నుంచి కొనుగోలు చేసిన్రు. యాదవులు కూడా ఎస్సీల నుంచి కొనుగోలు చేసుకుని, తర్వాత మా నాన్నకు అమ్మిన్రు. దీంతో ఆస్తి పంపకాల్లో భాగంగా రద్దు బదులు ద్వారా నాకు 30 గుంటల భూమి రాగా, అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న. 2017లో కేసీఆర్ సర్కార్ భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో అధికారులు నా భూమిని సర్వేచేసి, కబ్జాలో ఎవరు ఉన్నారని విచారణ చేసిన్రు. భూమిని అమ్మిన దళితుల వాంగ్మూలం తీసుకుని, అధికారులు నాకు ప్రొసీడింగ్ ఇచ్చిన్రు. తర్వాత కొత్త పట్టాదారు పాస్ బుక్ అందించి, రైతు బంధు సహాయం సైతం అందించారు. అప్పటి నుంచి వరిసాగు చేసుకుంటున్న.

## విచారణ లేకుండానే జైలుకు పంపడం న్యాయమా?


మోకాపై ఉన్న భూమిపై రెవెన్యూ అధికారులే విచారణ జరిపి పట్టా పాసుబుక్కు ఇస్తే కబ్జా ఎలా? అవుతుందో వాళ్లే చెప్పాలి. అసైన్డ్ భూమి పట్టా చేసుకోరాదని అధికారులు చెబితే అప్పుడే వదులుకునే వాడిని. నాకు చట్టాల గురించి తెలియదు. అధికారులు ఇచ్చిన పట్టాతో సాగు చేసుకుంటున్న. నాపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారు. అసైన్డ్ భూములు అనేక మందికి ఉన్నయి. నాపైనే ఎందుకు కేసుపెట్టారో అర్థం కావడం లేదు. సమాచారం ఇవ్వకుండానే పోలీసు ఇంటికి వచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లిండు. నాకు ఆపరేషన్ అయ్యిందని చెప్పినా వినలే. రిమాండ్‌కు తరలించడం సరైందికాదని వైద్యులు రిపోర్టు ఇస్తామని చెప్పినా కానిస్టేబుల్ వినలే. కానిస్టేబుల్ అతని ఉన్నతాధికారితో వైద్యుడికి ఫోన్ చేయించి రిపోర్టు వేరే విధంగా రాయించి జైలుకు పంపించిండు.

## కేటీఆర్ దయవల్లే బయటికి వచ్చా..

అన్యాయంగా అధికారులు జైలుకు పంపితే కేటీఆర్ దేవునోలె నన్ను బెయిల్‌పై బయటకు తెచ్చి, సొంత అన్నలా కొండంత ధైర్యం ఇచ్చిండు. పైసా ఖర్చులేకుండా కోర్టు ఖర్చులన్నీ సారే పెట్టుకున్నడు. గొంతు ఆపరేషన్ చేసుకుని ముద్ద మింగలేకున్న నేను ఐదు రోజులు జైల్లో నరకం చూసిన. నేను ఏ తప్పు చేయకున్నా జైలుకు పంపించడంతో మానసికంగా కుంగిపోయిన. కేటీఆర్ అండగా నిలువడం వల్ల ధైర్యం తెచ్చుకున్నా. బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి నన్ను పరామర్శించి మరింత భరోసా కల్పించిన్రు.'' అంటూ రాజిరెడ్డితో పాటు ఆయన భార్య లత ఈ సందర్భంగా కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు రుణపడి ఉంటామన్నారు. కాగా, తనకు భూమి లేకున్నా పర్వాలేదని, సమాజంలో పరువుతో ఉన్న తనపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని రాజిరెడ్డి కోరాడు.

## నేడు జిల్లాలో

# కేటీఆర్ పర్యటన



రాజన్న సిరిసిల్ల, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12 గంటలకు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చేరుకుంటారు. అక్రమ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని పరామర్శిస్తారు. 12.30 గంటలకు అంకుసాపూర్‌లో విలేకరి దినేశ్ వివాహ కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సిరిసిల్ల పట్టణంలోని సాయిమణికంఠ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకుడు కుంబాల మల్లారెడ్డి కూతురు వివాహానికి హాజరవుతారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ బుర్ర శంకరయ్య, కాసర్ల మల్లేశం కుటుంబాలను పరామర్శించి ఎల్లారెడ్డిపేట మండలానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు నీళ్లులేక ఎండుతున్న పంటలను పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో జరిగే రెండు వివాహాలకు హాజరై 4.30కి పోతుగల్‌కు చేరుకుంటారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు జెల్ల దేవయ్య కుటుంబాన్ని పరామర్శించిన తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు.

# గొంతెండె.. పంటెండె



బాకుర్‌పల్లిలో బిందెతో నీళ్లు తీసుకెళ్తున్న రమావత్ పద్మ

- బాకుర్‌పల్లిలో జల గోస
- సాగు, తాగుకు చుక్క నీటి కరువు
- మళ్లీ పదేండ్ల కింది నీటి కష్టాలు

**బాకుర్‌పల్లి బోరుమంటున్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జలగోసతో తల్లడిల్లుతున్నది. గతంలో పుష్కలమైన జలాలతో పసిడి పంటలతో తులతూగిన గ్రామం.. ప్రస్తుతం సాగుకు నీళ్లు లేక, ప్రభుత్వ నిర్లక్ష్యంతో మిషన్ భగీరథ నీరు సరఫరా లేక నరకం చూస్తున్నది. ఓ వైపు చేతికందిన పంటలు ఎండిపోతుండగా, మరోవైపు మంచినీళ్లు లేక తడారిపోతున్న గొంతుతో ఆదుకోవాలని వేడుకుంటున్నది.**

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 : గిరిజన తండాల్లో సాగు, తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఇందుకు బాకుర్‌పల్లి తండానే నిదర్శనంగా నిలుస్తున్నది. వేసవి ముదరక ముందే నీటి ఎద్దడితో అల్లాడిపోతున్నది. ఈ తండాను ఆనుకొని ఉన్న తిమ్మాపూర్ గ్రామంలోని మైసమ్మ చెరువులో నీరు ఉంటేనే ఇక్కడ బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగేవి. కానీ, చెరువు అడుగంటిపోగా, భూగర్భ జలాలు తగ్గిపోయాయి. ఈ తండా మీదుగా మల్కపేట రిజర్వాయర్ కెనాల్ వెళ్తున్నా ప్రభుత్వం చుక్కనీటిని వదలకపోవడం సమస్యగా మారింది. ఫలితంగా పంటలు ఎండిపోతుండడంతో పశువులను మేపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ తండానే కాదు.. దీంతోపాటు రాజన్నపేట, కిష్టునాయక్ తండా, దేవునిగుట్టతండాల్లోనూ ఇదే దుస్థితి ఉన్నది. ఇక్కడి ప్రజల కష్టాలు తెలుసుకుని మాజీ మంత్రి కేటీఆర్ స్పందించి మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని నీటి పారుదల శాఖ మంత్రికి లేఖ రాశారు. అయినా, ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి కనిపిస్తున్నది. ఇటు సాగు నీటికే కాదు.. తాగు నీటికీ తండా వాసులు నరకం చూస్తున్నారు. గతంలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేది. అయితే, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

## మంచినీళ్లకు తిప్పలైతంది..

ఊళ్లె ఎప్పుడూలేనిది ఇప్పుడు తాగే నీళ్లకు కూడా బాగా తిప్పలైతుంది. మిషన్ భగీరథ నీళ్లు వస్తలేవు. బోర్‌కాడ ఎత్తుకచ్చుకుందామంటే టైంకు కరెంటుంటలేదు. చేతి పంపు గూడా కొట్టంగ కొట్టంగ బిందెడు నీళ్లు వచ్చుడే ఇబ్బంది ఉంది. పదేండ్ల నుంచి ఏ సమస్య లేదు. ఇప్పుడే సెప్పరాని ఇబ్బందైతంది. తాగేతానికి నీళ్లు లేవు. పొలాలకాడ నీళ్లుంటలెవ్వు. ఎవ్వలకు సెప్పినా పట్టించుకుంట లేరు.

**- రమావత్ పద్మ, బాకుర్‌పల్లి, (ఎల్లారెడ్డిపేట)**



## కాల్వల నీళ్లెప్పడిస్తరు..?

నాకు ఊళ్లే మూడెకరాలు భూమి ఉన్నది. అందులో వరి వేసిన. సాగు నీళ్లు లేవు. పంట ఎండుతంది. కాల్వల నీళ్లిడుస్తమని సెప్పి ఇప్పుడు సప్పుడుజేస్తలేరు. బోరు ఉన్నా నీళ్లు ఎల్లుతలేవు. ఉన్న కొద్దిపాటి నీళ్లను పెట్టుకుందామంటే పొద్దందాక కరెంట్ ఉంటలేదు. ఎప్పుడస్తదో తెలుస్తలేదు. రాత్రి ఒకటిటికి కరెంటు ఇస్తున్రు. నా భర్త లేడు. మా యారాలును పట్టుకుని ఆడోళ్లం తెల్లందాక కరెంటుకాడికి పోతున్నం. ఏం జేసుడో అర్థమైతలేదు.

**- రమావత్ అనిత, మహిళా రైతు, బాకుర్‌పల్లి (ఎల్లారెడ్డిపేట)**

## పొలం కాడనే గుడిసేసి పంటున్న..



నాకు మూడెకరాల పొలం ఉన్నది. ఇంకో మూడెకరాలు కౌలుకు తీసుకుని చేస్తున్న. అండ్ల రెండెకరాలు ఇదివరకే ఎండిపోయింది. బావి ఉన్నా నీళ్లు లేవు. సైడ్ బోరు ఏసిన. నీళ్లు చాలుతలేవు. ఇదే బాధనుకుంటే కరెంటు సక్కగిడుస్తలేరు. అర్ధరాత్రి ఒంటి గంటకు వత్తున్నది. తెల్లందాక లేసి పోవుడైతుందని పొలంకాడనే గుడిసేసుకుని ఉంటున్న. ఇవారకే మస్కట్‌పోయి బాగ నష్టపోయిన. ఊళ్లె పంటలు మంచిగనే పండుతున్నయంటే వచ్చి ఎవుసం జేసుకుంటే ఇండ్ల గూడా నష్టం రావట్టె. సెరువులల్ల నీళ్లు నింపుతమని మొన్నటిదాక సెప్పిరి. ఇప్పుడు ఎవ్వలు పట్టించుకుంటలేరు. పొలం ఎండిపోతే ఏమస్తదని పశువులను మేపుతున్నం.

**- అజ్మీరా శ్రీనివాస్, రైతు, బాకుర్‌పల్లి (ఎల్లారెడ్డిపేట)**



బాకుర్‌పల్లిలో తాగునీటి కోసం బిందెలతో చేతిపంపు వద్ద నిల్చున్న మహిళలు



దేవునిగుట్టతండాలో పొలంలో పశువులను మేపుతున్న రైతు



కరీంనగర్: బ్యాలెట్ పేపర్ల ఫిజియన్ బాక్స్ పరిశీలిస్తున్న ఆర్‌వో పమేలా సత్పతి, ఇతర అధికారులు

# కౌంటింగ్‌కు సిద్ధం

- ఫిజిషియన్ బాక్సులు ఏర్పాటు
- పట్టభద్రుల ఓట్లకు 21.. ఉపాధ్యాయుల ఓట్లకు 14 టేబుళ్లు
- ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది
- మూడు షిఫ్టులుగా విధుల నిర్వహణ

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 1 : కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నెల 3న నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ మొదలు కానుండగా, దీనికోసం మొత్తం 35 టేబుళ్లు వినియోగించనున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 టేబుళ్లు ఉపాధ్యాయుల ఓట్లు కోసం ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. లెక్కింపు సిబ్బందికి అవసరమైన శిక్షణ శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులు అందజేశారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. స్ట్రాంగ్ రూములో నుంచి బ్యాలెట్ బాక్సులు లెక్కింపు కేంద్రం వద్దకు తరలించేందుకు అత్యధిక మంది సిబ్బంది అవసరముండగా, వీరిని మున్సిపల్ శాఖ నుంచి వినియోగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అత్యంత పటిష్టమైన భద్రత నడుమ లెక్కింపు చేపట్టనుండగా, ప్రతి టేబుల్ వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగనున్నది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుండగా, పూర్తయ్యే సరికి సుదీర్ఘ సమయం తీసుకోనున్న నేపథ్యంలో మూడు షిఫ్టుల్లో లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. అభ్యర్థుల వారీగా వేసిన ఓట్లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు సీరియల్ నంబర్ ప్రకారం ఒకేచోట బాక్సుల్లో ఉంచాల్సి ఉండగా, ఇందుకనుగుణంగా జంబో ఫిజిషియన్ బాక్సులు ప్రత్యేకంగా తయారుచేయించి, లెక్కింపు కేంద్రానికి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కౌంటింగ్ సెంటర్‌లో పటిష్టమైన మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశారు. లెక్కింపును ఆయా అభ్యర్థుల లెక్కింపు ఏజెంట్లు పరిశీలించేందుకు వీలుగా టేబుళ్ల చుట్టూ ఇనుప జాలి ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపర్లపై వేసిన నంబర్లపై ఎలాంటి అనుమానాలున్నా వాటిని ఏజెంట్లు క్షుణ్ణంగా పరిశీలించే అవకాశముంటుందని లెక్కింపు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా, లెక్కింపు కేంద్రాన్ని మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి సందర్శించారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లు గమనించారు. లెక్కింపు పూర్తయ్యేవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లెక్కింపు కోసం తయారు చేసిన ఫిజిషియన్ బాక్సులు, సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్‌తో పాటు పలువురు ఎన్నికల అధికారులు ఉన్నారు.

# అక్రమ వసూళ్లకు చెక్

- మానేరు నదిలో అనధికార టోల్ గేట్ తొలగింపు
- పెద్దపల్లి కలెక్టర్ ఆదేశాలతో అధికారుల చర్యలు
- సంచలనం రేపిన 'నమస్తే తెలంగాణ' కథనం
- టోల్ బాధ తీరడంతో వాహనదారుల్లో ఆనందం



మానేరులో మట్టిరోడ్డుపై అడ్డంగా పెట్టిన గేట్‌ను తొలగిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు.



నమస్తే తెలంగాణ

గేటెయ్.. దోచేయ్!

'నమస్తే'లో ప్రచురితమైన కథనం

పెద్దపల్లి, మార్చి 1(నమస్తే తెలంగాణ): మానేరు నదిలో అక్రమ టోల్ ట్యాక్సీ వసూళ్లకు అధికార యంత్రాంగం చెక్ పెట్టింది. కొద్దిరోజులుగా అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న దందాకు అడ్డుకట్ట వేసింది. ముత్తారం మండలం ఓడేడ్– జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మానేరు నదిలో మట్టి రోడ్డుపై అక్రమంగా టోల్ గేట్ ఏర్పాటు చేసి కొద్దిరోజులుగా దర్జాగా చేస్తున్న వసూళ్ల దందాపై 'దర్జాగా దారి దోపిడీ..'అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' మెయిన్‌లో, 'గేటెయ్.. దోచేయ్..'అనే శీర్షికన జిల్లా ఎడిషన్‌లో శనివారం కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా, ఈ కథనాలు ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సంచలనం రేపాయి. ఈ క్రమంలో పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించి సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే మానేరుపై అక్రమ టోల్ గేట్‌ను తొలగించాలని ఆదేశాలివ్వగా, ఉదయాన్నే మంథని సీఐ రాజుగౌడ్, ఆర్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు ముత్తారం మండలం ఓడేడ్ మానేరు నదీ తీరానికి చేరుకున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను తొలగించారు. ఇక్కడ ఎలాంటి వసూళ్లకు పాల్పడవద్దని, ఉచితంగానే వెళ్లనివ్వాలని నిర్వాహకులను హెచ్చరించారు. కాగా, అక్రమంగా ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను తొలగించడంతో ఆయా గ్రామాల ప్రజలకు వసూళ్ల బెడద తప్పింది. నిన్నటి వరకూ డబ్బులు చెల్లిస్తూ ప్రయాణించిన ప్రజలు శనివారం నుంచి ఉచితంగా ప్రయాణిస్తూ సంబురపడ్డారు. 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

## సంతోషంగా ఉంది..



ఇక్కడి బ్రిడ్జి పూర్తికాకపోవుడేందో గానీ ఇక్కడి మట్టి రోడ్డు మీది నుంచి పోయేతందుకు ఇన్నాళ్లూ మాకు చాలా టాక్సీ పడ్డది. వీళ్లకు పైసలు ఇయ్యలేక తిప్పలవడ్డం. అడిగేటోళ్లే లేకపోయిన్రు. బాధపడుకుంటనే కట్టినం. ఏది ఏమైనా 'నమస్తే తెలంగాణ'లో వార్త వచ్చుడేమోగానీ టోల్ గేట్ పోయింది. మాకైతే ఈ టాక్సీ బాధ తప్పింది. చాలా సంతోషంగా ఉంది.

**- మారపెల్లి రాజయ్య, గర్మిళ్లపల్లి (జయశంకర్‌భూపాలపల్లి జిల్లా)**

## చాలా దురుసుగా ప్రవర్తించేవారు..



నేను వ్యాపార పనుల కోసం వివిధ ప్రాంతాలకు తిరుగుతుంటా. మానేరువాగు గుండా టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి, పరకాల తదితర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటా. ఈ రోడ్డుపై టోల్ వసూలు చేసేవాళ్లు చాలా దురుసుగా ప్రవర్తించేవారు. ఈ చిన్న కిలో మీటర్ రోడ్డుకు రూ.100 తీసుకునేటోళ్లు. హైవేపై కూడా ఇంత లేదని నేను వాదించా. నిలదీసిన. వాళ్లు మాత్రం నీ ఇష్టం ఇటు వస్తే రా లేకపోతే లేదని దురుసుగా ప్రవర్తించే వారు. ఈరోజు ఈ మార్గంగా గుండా చిట్యాలకు వెళ్తుంటే టోల్గేట్ లేదు. విషయం తెలుసుకొని చాలా సంబురపడ్డా. మళ్లీ ఎలాంటి ఒత్తిళ్లకు లోనవ్వకుండా అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరుకుంటున్నా.

**- ఓరుగంటి రాజకుమార్ వ్యాపారి, యైటింక్లైన్ కాలనీ, గోదావరిఖని**



ఉదయం నాలుగు గంటలకు విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

# ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన

- తమ డిమాండ్లు నెరవేర్చాలని, తోటి డ్రైవర్‌కు డ్యూటీ ఇవ్వాలని నిరసన
- బస్టాండ్‌లో నిలిచి పోయిన బస్సులు
- ఇబ్బంది పడ్డ ప్రయాణికులు

కరీంనగర్ తెలంగాణచౌక్, మార్చి 1: ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు కన్నెర్రజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, డ్యూటీ ఇవ్వడం లేదని మనస్తాపంతో రెండ్రోజుల కింద ఆత్మహత్యాయత్నం చేసుకున్న తోటి డ్రైవర్ సురేశ్‌కు విధులు అప్పగించాలని శనివారం ఉదయం 4 గంటల నుంచి విధులు బహిష్కరించారు. బస్టాండ్‌లో నిరసన చేపట్టారు. ఆందోళనతో కరీంనగర్ రెండు డిపోల నుంచి జమ్మికుంట, వీణవంక, బెజ్జంకి, వేములవాడ, గోదావరిఖని, చొప్పదండి, ధర్మపురి, మంచిర్యాల, సిద్దిపేట రూట్లలో వెళ్లాల్సిన 98 అద్దె బస్సులు నిలిచిపోవడం, అందులో ప్రధానంగా పల్లె వెలుగులే ఉండడంతో గ్రామీణ ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం గ్రామాల నుంచి నగరానికి కూరగాయలు, పాలు రాలేదు. వివిధ షాపుల్లో పని చేసే చిరు ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు తిప్పలు పడ్డారు. అద్దె బస్సుల యాజమానులు ఇతర డిపోల నుంచి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లను రప్పించినా, 20 బస్సులే నడిచాయి. కాగా, నిరసన చేస్తున్న డ్రైవర్లతో ఆర్టీసీ అధికారులు చర్చలు జరుపలేదు. విజిలెన్స్ అధికారులు మాత్రం వచ్చి మాట్లాడగా, తమ డిమాండ్లు నెరవేరిస్తేనే విధులకు హాజరవుతామని స్పష్టం చేశారు. అయితే, బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు కంట్రోలర్లతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు శశికుమార్ మాట్లాడుతూ బ్రీత్ అనలైజర్లలో లోపాలు ఉన్నాయని, మద్యం అలవాటు లేని వారికి కూడా తాగినట్లు చూపిస్తున్నాయని, రెండు డివైజర్లతో టెస్టులు చేయాలన్నారు. బస్సు డోర్ నుంచి ప్రయాణికులు కింద పడితే డ్రైవర్లను బాధ్యులు చేయవద్దన్నారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని, తమ తోటి డ్రైవర్ సురేశ్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆదివారం కూడా నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.



ప్లాట్ ఫారం వద్ద ప్రయాణికులు